# గౌరారంలో 99 రోజుల ప్రజాపాలన గ్రామసభ



ఇది కద నిజం,ఉమ్మడి నిజామాబాద్ జిల్లా, పిట్లం, ఏప్రిల్ 2 : తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రణాళికలో భాగంగా కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని గౌరారం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలుపై గ్రామస్థులతో చర్చించి వారి నుంచి వినతులు, సూచనలు స్వీకరించారు. ఈ గ్రామసభను గ్రామ సర్పంచ్ లోకినేని హనుమంతరావు ఆధ్వర్యంలో నిర్వహించగా, పంచాయతీ సెక్రెటరీ బి. లక్ష్మణ్, స్పెషల్ ఆఫీసర్ పద్మావతి, ఉప సర్పంచ్ హనుమాన్లు, వార్డ్ మెంబర్లు కుమ్మరి రాజు మారుతి వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, జె శంకర్ మహేష్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# గౌరారంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహణ



ఇది కద నిజం,ఉమ్మడి నిజామాబాద్ జిల్లా, పిట్లం, ఏప్రిల్ 2: కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని గౌరారం గ్రామంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ లోకినేని హనుమంతరావు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను ఘనంగా జరిపారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం రథోత్సవ కార్యక్రమం వైభవంగా సాగింది. అలాగే గ్రామ దేవతలకు బండ్ల ప్రదక్షిణ నిర్వహించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు జుప్పాల శంకర్ లక్ష్మా గౌడ్ కాంట్రవిటల్ కాడల సంతు కుమ్మరి రమేష్ కుమార్ అంజయ్య దేంజ్రాయుడు ఎస్ రాములు మరియు గ్రామ ప్రజలు, మహిళలు యువత బంధువులు, గ్రామ పెద్దలు భారీ సంఖ్యలో పాల్గొని హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామమంతా భక్తి వాతావరణంతో నిండిపోయి పండుగ శోభను సంతరించుకుంది.

# పులుమామిడిలో వైభవంగా హనుమాన్ శోభాయాత్ర!



ఇది కద నిజం, పులుమామిడి: నవాబ్‌పేట మండలం పులుమామిడి గ్రామంలో హనుమాన్ జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా కొనసాగింది. శోభాయాత్రకు ముందుగా భక్తులందరూ కలిసి సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో గ్రామ సెక్రటరీ నితిన్ కుమార్, సర్పంచ్ నర్సింహులు, ఉప సర్పంచ్ నాగిరెడ్డితో పాటు వార్డు మెంబర్లు ప్రత్యేకంగా పాల్గొన్నారు. జై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాలతో గ్రామం మారుమోగిపోయింది. ఈ వేడుకల్లో గ్రామస్తులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని శోభాయాత్రను విజయవంతం చేశారు.

# అవినీతి ఊబిలో నవాబుపేట్ తహసీల్దార్ కార్యాలయం!

- ☐ నవాబుపేట్ ఎంఆర్ఓ ఆఫీస్ అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది
- ☐ లంచం ఇస్తేనే తప్ప ఇక్కడ ఏ ఫైలు కూడా ముందుకు కదలడం లేదు
- ☐ అటెండర్ నుండి పై అధికారి వరకు లంచం లేనిదే పని చేయడం లేదు
- ☐ భూమి పనుల కోసం వచ్చే రైతులను డబ్బుల కోసం ముప్పతిప్పలు పెడుతున్నారు
- ☐ డబ్బు లేని పేదవారికి ఇక్కడ న్యాయం జరగడం గగనమైపోయింది



- ☐ బహిరంగంగా వసూళ్లు జరుగుతున్నా ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువైంది

ఇది కద నిజం, నవాబుపేట్ :వికారాబాద్ జిల్లా నవాబుపేట్ మండలం రెవెన్యూ కార్యాలయం ప్రస్తుతం అవినీతికి అడ్డాగా మారింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరగాల్సిన పనులు సైతం కాసుల కక్కుర్తి లేనిదే కదలడం లేదు. కార్యాలయంలో అడుగు పెట్టిన సామాన్యుడికి న్యాయం జరగాలంటే ముందుగా అధికారుల జేబులు నింపాల్సిందేనన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టాదారు పాసు పుస్తకాలు, భూముల సర్వే, విరాసత్ మార్పిడి వంటి చిన్న చిన్న పనులకు కూడా అధికారులు, సిబ్బంది వేలల్లో లంచాలు డిమాండ్ చేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయంలో పనిచేసే కింది స్థాయి సిబ్బంది నుండి పైస్థాయి అధికారుల వరకు అంతా ఒక్కటై, సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తూ అందినకాడికి దండుకుంటున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. లంచం ఇస్తే గంటల్లో అయ్యే పని, ఇవ్వకపోతే నెలల తరబడి పెండింగ్‌లో పెడుతూ రైతులను కార్యాలయం చుట్టూ తిప్పుకోవడం ఇక్కడ నిత్యకృత్యమైంది. ఉన్నతాధికారులు స్పందించి నవాబ్‌పేట ఎంఆర్ఓ ఆఫీసులో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపి, అవినీతి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఆత్మహత్య గుట్టురట్టు



గుంటూరు (ఇది కద నిజం) పల్నాడు జిల్లా మాచర్ల పట్టణంలోని పాతూరులో ఇటీవల జరిగిన నవ వధువు కామనబోయిన చౌడే శ్వరి(22) మృతికి సంబంధించి పోలీసుల విచారణలో విస్తుపోయే నిజాలు బయటకు వచ్చాయి.

చౌడేశ్వరి పోస్టుమార్టం రిపోర్టులో ఆత్మహత్య కాదని తేలడంతో పోలీసులు మంగళవారం ఆమె తండ్రి చంద్రశ్రీనుతోపాటు కుటుంబ సభ్యులను అదుపులోకి తీసుకొని విచారించారు. శ్రీను కుమార్తె చౌడేశ్వరి(22), మాచర్ల మండలం జమ్మలమడక గ్రామానికి చెందిన గంగనబోయిన నాగరాజు ఏడాది కాలంగా ప్రేమించుకున్నారు. ఇరువురిదీ ఒకే సామాజిక వర్గం. అయినా చంద్రశ్రీనుకు వారిద్దరి పెళ్లి ఇష్టంలేదు.


ఈ నేపథ్యంలో గత నెల 4న ప్రేమికులిద్దరూ ఇల్లు విడిచి పారిపోయారు.

విజయవాడలోని ఓ దేవాలయంలో పెళ్లి చేసుకొని, అక్కడి నుంచి చెన్నై వెళ్లి వారం రోజులపాటు గడిపారు. తర్వాత నరసరావుపేటలో నాగరాజు అనే స్నేహితుడు ఇంటికి చేరుకున్నారు. ఈలోగా తన కూతురు కనిపించడం లేదంటూ చంద్రశ్రీను పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు గత నెల 15న నరసరావుపేటలో నాగరాజు, చౌడేశ్వరిలను కనిపెట్టి.. వారిని మాచర్ల తీసుకొచ్చారు.

ఇరువురూ మేజర్లు కావడంతో చేసేదేమీ లేక వారితో మాట్లాడే అవకాశాన్ని కల్పించారు. ఈ సందర్భంగా ఆమె.. నేను నాగరాజును పెళ్లి చేసుకు న్నాను.. అతడితోనే వెళ్తా' అని తేల్చి చెప్పింది. దీంతో ఇరువర్గాల పెద్దలు ఐదు రోజుల సమయం పెట్టుకొని అమ్మాయిని.. తండ్రి చంద్రశ్రీనుతో ఇంటికి పంపారు. అయితే గత నెల 18వ తేదీన చౌడేశ్వరి ఇంట్లో ఫ్యాన్కు వేలాడుతూ శవమై కనిపించింది. ఈ కేసుకు సంబంధించి మృతురాలు తల్లిదండ్రులను అదుపులో తీసుకొని విచారిస్తున్నట్టు తెలుస్తుంది.

# అమరావతికి చట్టబద్ధత..కేంద్రం నిబద్ధత

## - ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలియజేసిన మంత్రి నారా లోకేష్



ఐదుకోట్ల ప్రజల ఆకాంక్ష అయిన అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు పూర్తి మెజారిటీతో పార్లమెంటు ఆమోదం లభించడానికి కృషి చేసిన ప్రధాని నరేంద్ర మోదీ గారికి ఏపీ విద్యా-ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఏపీ అసెంబ్లీలో చేసి పంపిన తీర్మానంపై లోక్ సభలో సుదీర్ఘ చర్చ జరిగిన అనంతరం అమరావతి బిల్లును ఆమోదించారు. దేశంలో ఉన్న అన్ని పార్టీలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైపు నిలిపి అమరావతి బిల్లుకు చట్టబద్ధత కల్పించిన ప్రధాని నరేంద్ర మోదీ గారిని పార్లమెంటు హాలులో కలిసి ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. లోక్ సభలో బిల్లు ఆమోదం పొందిన వెంటనే ఆగమేఘాలపై ఢిల్లీ వచ్చిన మంత్రి లోకేష్ కూటమి పార్టీ ఎంపీలను అభినందించారు. అనంతరం గురువారం ఉదయం ప్రధానమంత్రి మోదీని కలిసి అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ లోక్ సభ ఆమోదంపై ధన్యవాదాలు తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి కేంద్రప్రభుత్వం చూపిన నిబద్ధతను మంత్రి ప్రశంసించారు.




# ఒంటిమిట్ట రామయ్యకు ముఖ్యమంత్రి హోదాలో 6 వ సారి పట్టు వస్త్రాలు సమర్పణ

## ముఖ్యమంత్రి హోదాలో నేటికీ ఒంటిమిట్ట కోదండ రాములోరి కళ్యాణానికి ఆరుసార్లు పట్టు వస్త్రాలు సమర్పించిన చంద్రబాబు నాయుడు

కడపజిల్లా(ఇది కద నిజం)మార్చి03 ఒంటిమిట్ట రామయ్య కళ్యాణం తిరుమల,తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో దాదాపుగా 80 వేల మంది భక్తుల మధ్యన అంగరంగ వైభవంగా రామనామ స్మరణంతో అయోధ్యను మించిన కళ్యాణం ఒంటిమిట్ట శ్రీ కోదండరామ సీతారాముల కళ్యాణం జరిగిందని చెప్పొచ్చు.ఈకళ్యాణం సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు, భువనేశ్వరి దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.రాష్ట్ర విభజన జరగకముందు అధికారికంగా కళ్యాణాన్ని భద్రాచలం క్షేత్రంలో నిర్వహించేవారు.ఆ తర్వాత ఒంటిమిట్టను ఎంపిక ఎంపిక చేయడంతో 2015 లో మొదటి సారి సీఎం హోదాలో చంద్రబాబునాయుడు స్వామి వారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ప్రస్తుతం 6 వ సారి పట్టు వస్త్రాలు సమర్పించే అవకాశాన్ని దక్కించుకున్నారని,పలువురు భక్తులు ఆనందం వ్యక్తం చేశారు..

# నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి గారి కుమార్తె వివాహానికి హాజరైన పీవీఎన్ మాధవ్, పాతూరి.



హైదరాబాద్: నంద్యాల జిల్లా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, వెంకటరెడ్డి దంపతుల కుమారుడు జనార్ధన్ రెడ్డి.. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి ఎమ్మెల్యే, బీజేపీ నాయకులు నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతుల కుమార్తె సనాతనిల వివాహం నేడు హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని జీ=జ కన్వెన్షన్‌లో జరిగింది. ఈ వివాహ వేడుకకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ. పీవీఎన్ మాధవ్ గారి తోపాటు హాజరై.. నూతన వధూవరులను ఆశీర్వదించిన బీజేపీ స్టేట్ ప్రోగ్రామ్స్ అండ్ ప్రోటోకాల్ ఇన్ ఛార్జ్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీ. పాతూరి నాగభూషణం గారు, మరియు రామినేని ధర్మ ప్రచారక్ గారు.

# అమరావతిలో సచివాలయ ఉద్యోగుల సంబరాలు

## కేకు కట్ చేసి, దీపాలు వెలిగించి కేంద్రానికి కృతజ్ఞతలు



అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించడంపై సచివాలయ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. కేంద్రం తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయంతో రాజధాని భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితి తొలగిపోయిందని పేర్కొంటూ సచివాలయ ఉద్యోగ సంఘాల నాయకులు ప్రత్యేక వేడుకలు నిర్వహించారు.

**సచివాలయంలో పండుగ వాతావరణం**

ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు కేకు కట్ చేసి ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. అనంతరం సాయంత్రం వేళ దీపాలు వెలిగించి అమరావతి ప్రాముఖ్యతను, కేంద్రం అందించిన సహకారాన్ని కొనియాడారు. రాజధాని అభివృద్ధికి కేంద్రం తీసుకున్న ఈ ముందడుగు రాష్ట్ర ప్రగతికి ఊతమిస్తుందని వారు అభిప్రాయపడ్డారు.

**కేంద్రానికి కృతజ్ఞతలు**

ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నేతలు మాట్లాడుతూ.. "అమరావతికి చట్టబద్ధత కల్పించడం ద్వారా కోట్లాది మంది ఆంధ్రుల ఆకాంక్షలను కేంద్ర ప్రభుత్వం గౌరవించింది. దీనివల్ల రాజధాని ప్రాంతంలో మౌలిక సదుపాయాల కల్పన వేగవంతం కావడమే కాకుండా, ఉద్యోగుల్లోనూ కొత్త ఉత్సాహం నెలకొంది" అని తెలిపారు. ఈ కీలక నిర్ణయానికి మద్దతుగా నిలిచిన కేంద్ర ప్రభుత్వానికి వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ వేడుకల్లో సచివాలయ వివిధ విభాగాలకు చెందిన ఉద్యోగులు, సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పుల్లూరులో వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవ వైభవం



కడపజిల్లా (ఇది కద నిజం)ఏప్రిల్ 03: ఖాజీపేట మండలం..పుల్లూరు గ్రామంలోని నాగనాగేశ్వర కోనక్రింద ఉన్న శ్రీశ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో 41 రోజుల పాటు నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా ఈరోజుటితో ముగిశాయి.ఈ సందర్భంగా గోవింద సమేత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం ఈరోజు ఏప్రిల్ 2 న వైభవంగా నిర్వహించబడింది.ఈమహోత్సవంలో భాగంగా ఉదయం నుండి విశేష హోమ కార్యక్రమాలు వేద మంత్రోచ్చారణల మధ్య భక్తి శ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. యజ్ఞాలు,పూజలు,శాస్త్రోక్తంగా నిర్వహించబడగా, దేవస్థానం ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది.ఈ దివ్య కార్యక్రమాన్ని దర్శించేందుకు పరిసర ప్రాంతాల నుండి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.స్వామివారి కళ్యాణాన్ని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు.ఈ కార్యక్రమం మహంకాళి వీర బ్రహ్మయ్యచార్యులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది.వారి మార్గదర్శకత్వంలో పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా కొనసాగాయి.అనంతరం భక్తులకు అన్నప్రసాద కార్యక్రమంనిర్వహించబడగా, భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.మొత్తం మీద ఈ కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధల నడుమ విజయవంతంగా నిర్వహించబడింది....

